# అపురూప

– మాచిరాజు కామేశ్వరరావు

"మీట్ మిస్టర్ శాండిల్య– ఆఫీసర్! చెప్పాను కదా? ఆయన వచ్చారంటే తొమ్మిదిన్నర అయినట్టుగా గడియారాలు సరిచేసుకోవచ్చనీ!" ఎదురుగా కూర్చున్న అమ్మాయికి శాండిల్యను పరిచయం చేశాడు బ్యాంక్ మేనేజర్.

"నమస్తే!" వీణ మీటినట్లుంది ఆమె స్వరం.

ఆమె అపురూప సౌందర్యం చూసి క్షణం రెప్ప వేయడం మరిచాడు శాండిల్య.

నునుపైన చెక్కిళ్ళు, విశాలంగా పరుచుకున్న నయనాలు, ముద్దొచ్చే నిటారైన నాసిక, పల్చటి గులాబీ రేకుల్లా మెరుస్తున్న పెదాలు, గుండర్ని చుబుకం, శంఖాన్ని తనదన్నేలా వున్న మెడ, పుష్టిగా వున్న భుజాలు, కడలి తరంగంలా కవ్వించే ఎదపొంగులు– పాలరాతి మందిరాల్లో, చక్రవర్తుల అంతఃపురాల్లో రవి కూడా కాంచని రాచరికపు కన్నె నాజూకైన దేహంలా పచ్చటి పసిమితో కాంతులీనుతున్న శరీరం!

శాండిల్యను చూడగానే ఆమె గుండెల్లో ఝల్లుమన్న భావన! ముప్ఫయ్ అయిదు, నలభై ఏళ్ళ మధ్య వయసులో ఛామన ఛాయలో వున్నా ఆ ముఖంలో ఎంత కళ వుంది? మనిషి ఆరడుగుల పొడవుతో దృఢంగా ఉన్నాడు. విశాలమైన ఛాతీ. ఫుల్ స్లీవ్స్ మోచేతులపైకి మడవడంతో షర్ట్ క్రింద పొంగి వున్న కండలు! టైట్ పాంట్ మీద బ్లూకలర్ షర్ట్ టక్ చేశాడు. కుదురుగా దువ్విన వుంగరాల జుత్తు!

గదిలో పరుచుకున్న మౌనాన్ని ఛేదించడానికన్నట్టుగా చిన్నగా దగ్గాడు మేనేజర్. "ఈమె మిస్ అపురూప! ప్రొబేషనరీ ఆఫీసర్! మన బ్రాంచ్‌లో నాలుగు నెలలుంటారు!"

"యూ ఆర్ మోస్ట్ వెల్‌కమ్ మేడమ్! మీ ఆర్డర్ ఇరవై రోజుల క్రితం కాబోలు చూశాను– మద్రాసు కదా మీరు వచ్చింది?" అంటూ ఆమె పక్క కుర్చీలో కూర్చున్నాడు శాండిల్య.

సన్నజాజులు, సంపెంగలు, చామంతులు, గులాబులు కలిసివున్న బుట్టలోనుంచి వస్తున్న సుగంధాల కలగలుపుగా వుంది–ఆమె శరీరం మీద నుంచి వస్తున్న పరిమళం.

'అవును–ఫస్ట్ పోస్టింగ్ మద్రాస్. అక్కడనుంచి ఇలా అనంతపురానికి! నాలుగు నెలల తర్వాత ఇంకెక్కడికో? రెండేళ్ళ పాటు ప్రొబేషన్ అయ్యే దాకా ఈ తిప్పలు తప్పవుగా! నవ్వింది పల్చగా– చూడగానే నోరూరిస్తూ నోట్లో వేసుకుని చప్పరించాలనే దానిమ్మ గింజలు కళ్ళ ముందు కదిలాయి ఆమె తీరైన పలువరస చూస్తుంటే!

"ఇక్కడ మీ వసతి?

"సాయి నగర్‌లో మా పిన్ని కూతురు వుంటోంది. ఈ నాలుగు నెలలూ నన్ను భరించక తప్పదు దానికి".

టైం పది నిమిషాలు తక్కువ పది!

"క్యాష్ తీద్దాం పదండి– ఈరోజు రంగరాజు రావడంలేదని ఫోన్ చేశాడు. మేడమ్‌ని ఎస్.బి. కౌంటర్‌లో కూర్చోబెట్టండి!" లేచాడు మేనేజర్, డబుల్ లాక్ కీస్‌ను బల్ల సొరుగులోంచి తీస్తూ.

ఎస్.బి. కౌంటర్ హెవీగా వుండడంతో మళ్ళీ లంచ్ టైం దాకా శాండిల్యను చూసే అవకాశమే దొరకలేదు అపురూపకి. మధ్యాహ్నం రెండింటికి కూడా పొద్దున తొమ్మిదిన్నరకి చూసినట్టుగా ఫ్రెష్‌గా చెక్కుచెదరని చిరునవ్వుతో శాండిల్య.

"ఎలా వుంది మేడమ్ ఫస్ట్‌డే?" ఆప్యాయంగా పలుకరించాడు శాండిల్య లంచ్ టేబుల్ దగ్గర.

"శక్తంతా ట్యూబ్‌తో లాగేసినట్టు వుంది– మీరు మాత్రం మూడు డిపార్ట్‌మెంట్లు చూసుకుంటూ కూడా మార్నింగ్ కన్నా చురుగ్గా కవ్విస్తున్నారు!" మనస్ఫూర్తిగా అంది అపురూప.

"ఎంత చురుకుదనం, నైపుణ్యం వున్నాయీ మనిషిలో!" మొదటిసారిగా జీవితంలో ఒక మగాడి పట్ల అభిమానం ఏర్పరుచుకుంది ఆమె!

నెల తిరగకుండా ఆ అభిమానం కాస్తా అంతు లేని ఆకర్షణగా మారింది.

మేనేజర్, ఇద్దరు ఆఫీసర్లు, నలుగురు క్లర్కులు, ఒక ప్యూన్– వెరసి ఆ బ్రాంచ్ స్టాఫ్. రెండో ఆఫీసర్ రంగరాజు పూర్తిగా శాండిల్యకి వ్యతిరేకం. అతనికి ఆస్తమా–ఎప్పుడూ దగ్గుతూ వుంటాడు. శీతాకాలం కావడంతో అతని పాట్లు రెట్టింపయ్యాయి. అందుకే తరచూ లీవ్ పెడుతున్నాడు. అపురూపకి ఆ బ్రాంచ్‌లో పని ఎక్కువగానే వుంటోంది. తెలియని విషయాలు కూడా తెలియనట్టుగా శాండిల్యని సీట్ దగ్గరకి పిలిపించుకునేది ఆమె.

అతని స్వరం వింటుంటే మత్తు!

దగ్గరగా నిలబడ్డ అతని నిండైన విగ్రహాన్ని, బలంగా వున్న చేతుల్ని, నున్నటి షేవ్ వల్ల మెరుస్తుండే అతని బుగ్గల్ని మార్చి మార్చి చూస్తుండేది. రక్తం అంతా ఆవిర్లు కక్కుతూ పొంగుతున్న అనుభూతి. ఎత్తైన ఎదలో ఏదో తెలియని తీయని బాధ. పాతికేళ్ళ యవ్వనానికి ఏదో కావాలనే తపన! తహతహ!

నిద్రలో కూడా శాండిల్య రూపమే! అతని విశాలమైన ఎద బలంగా కసిగా తన యవ్వన సంపదను అదిమేస్తున్నట్టు, బలిష్టమైన అతని చేతుల్లో సన్నటి తీగలాంటి నడుం చిక్కుపడి గిజగిజలాడిపోతున్నట్టు, అతని చేతులు అల్లరిగా శరీరం అంతా కదులుతున్నట్టు– ఆ స్పర్శలో దాగివున్న జ్వాల– అందులో వెన్నలా కరిగిపోతూ తను!

అపురూపకి ఆశ్చర్యంగా వుంది. తను కాలేజీలో వుండగా తన అందానికి దాసోహం అంటూ డజన్ల కొద్దీ అబ్బాయిలు తన చుట్టూ తిరుగుతూ వుండేవారు. అయితే వాళ్ళో ఎవ్వరూ ఎటువంటి స్పందన తనలో కలిగించలేకపోయారు. అటువంటిది, ఒక ముప్పై ఏడేళ్ళ వ్యక్తి, పెళ్ళయినవాడు, ఇద్దరు పిల్లల తండ్రి–తనలో అలజడి రేపుతున్నాడు. తనకి తెలుసు. ఇది ప్రేమ కాదు! కేవలం ఆకర్షణ! ఇది తప్పని తన మనసుకు నచ్చచెప్పలేకపోతోంది. శాండిల్యతో జీవితం పంచుకోవడం అసంభవం. అయితే ఒక్కసారయినా అతని కౌగిలిలో కరగని ఈ జీవితం వ్యర్థం! అవును! కనీసం ఒక్కసారి! తృప్తిగా, ఆర్తిగా, ఆనందంగా అతనికి అర్పించుకోవాలి! ఇది అనైతికం! అయితేనేం! అతనితో ఆ సుఖం ఒక్కసారి పంచుకున్నాక తను చచ్చిపోయినా ఫర్వాలేదు! ఎలాగైనా ఈ ఊరు వదిలేలోగా ఒక్కసారి అతడి కౌగిలిలో కరిగిపోవాలి. ఈ శరీరానికి, మనసుకి సర్దిచెప్పడం తలవల్ల

కావడం లేదు!

** ** ** ** ** పిల్లికూతలెక్కువ కావడంతో ఆరోజు రంగరాజు బ్యాంక్‌కి రాలేదు. అనుకోకుండా భార్య కళ్లుతిరిగి పడిపోయిందన్న వార్త తెలిసి లంచ్ అవర్ కాగానే ప్యూన్ వెళ్ళిపోయాడు. డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ మీట్ అటెండ్ అవ్వడానికి తప్పనిసరిగా డబుల్ లాక్‌కీస్ అపురూపకి ఇవ్వాల్సివచ్చింది మేనేజర్‌కి!

ఐదింటికల్లా మిగిలిన సిబ్బందీ వెళ్ళిపోయారు.

బ్యాంక్‌లో శాండిల్య, అపురూప ఇద్దరే మిగిలారు! శీతాకాలం కావడంతో ఐదున్నరకే లోకంమీద చీకటి తెరలు పరుచుకుంటున్నాయి.

అపురూపకి ఆనందంగా వుంది. అంతకు మించి ఉద్వేగంగా వుంది. ఇంత మంచి అవకాశం మళ్ళీ రాదు. మరో నెల రోజుల్లో తను ఈ వూరు విడిచి వెళ్ళిపోతుంది అపురూపమైన అనుభవాన్ని గుండెల్లో పదిలంగా దాచుకుని! ఆడది తనంతట తాను చొరవ చూపిస్తే ఏ మగవాడు మాత్రం కాదనగలడు? స్త్రీని మించిన విషా, ఆనందం, ఆకర్షణ, అనుభవం పురుషుడికి మరేం వుంటుంది?

"క్యాష్ లోపల పెట్టాలి– కీస్ తీసుకుని పదండి!" ప్యూన్ లేకపోవడంతో క్యాష్ బాక్స్ తనే మోసుకువచ్చాడు శాండిల్య. హ్యాండ్ బ్యాగ్ లోంచి కీస్ తీసుకుని, నిద్రలో నడుస్తున్న దానిలా అతని వెనకాలే లోపలికి నడిచి వెళ్ళింది అపురూప! అతను బీరువా తలుపు తీసి క్యాష్ బండిల్స్ లోపల సర్దుతున్నాడు. "మీరు కూడా లెక్క చూడండి!"

ఆమె అతడినే చూస్తోంది. వెనుక నుంచి మరీ ఆకర్షణీయంగా వుంది అతని రూపం. తమకాన్ని అవుకోలేక క్యాష్ లెక్కిస్తున్నట్టుగా వెనక నుంచి అతడిని అనుకుని నిలబడింది అపురూప! బీరువా అడ్డంగా వుండడంతో ముందుకు కదిలే అవకాశమే లేదు శాండిల్యకి.

ఆమె యవ్వన సంపద అతని వీపుకి గుచ్చుకుంటూ– ఆమె వెచ్చని ఊపిరి అతని కంఠాన్ని కాలుస్తూ–

క్షణ కాలం స్తంభించింది.

ఆమె చేతులు అతని భుజాల క్రిందుగా అతని వక్షస్థలాన్ని అదిమాయి. చొక్కా పైబటన్ తొలగి వుండడంతో ఆమె నాజూకైన వేళ్ళు అతడి వక్షానికి వెచ్చగా తగులుతున్నాయి.

శాండిల్య కదిలాడు.

ఇక ఓర్చుకోలేనట్టుగా పూర్తిగా అతని మీదకు వాలిపోయింది ఆమె.

"అపురూప గారూ..ఏమిటీ పని? వదలండి!" వెనక్కి తిరగడానికి కూడా వీలు లేకుండా వుంది శాండిల్యకి.

అపురూప ఊపిరి బరువుగా వస్తోంది. తుపాను గాలికి ఊగిపోతున్న సన్నజాజి తీగలా మెలికలు



తిరిగిపోతోంది ఆమె సన్నని నడుం! శరీరం దహించుకుపోతున్నట్టుగా ఒంట్లోంచి వెచ్చని ఆవిర్లు! మోయలేని హాయిని మోస్తున్నట్టుగా బరువుగా మూసుకుపోతున్న నయనాలు.

అతి కష్టం మీద ఈ వైపుకి తిరిగాడు శాండిల్య.

కళ్ళు మూసుకుని పూర్తిగా అతని మీదకు వాలిపోయింది ఆమె.

"అపూరూప గారూ! ఏమైయింది మీకు? కళ్లు తెరవండి!" ఆమె భుజాలు గట్టిగా కుదిపాడు శాండిల్య.

తన జీవితం ధన్యం అయిపోయినట్టుగా అతని గుండెల్లో మొహం దాచుకుంది ఆమె.

ఆమెకు ఏదో అయిపోయిందనుకుని ఆత్రతగా రెండు చేతుల్లో ఆమెను ఎత్తుకుని, మేనేజర్ క్యాబిన్ బయట వున్న సోఫాలో పడుకోబెట్టాడు శాండిల్య. మరుక్షణం కంగారుపడుతూ లంచ్‌రూంలోకి వెళ్ళి

గాజు గ్లాసులో నీళ్ళు పట్టి తెచ్చాడు.

సోఫాలో ఎడం చేయి క్రిందకు వ్రేలాడేసుకుని కళ్ళు మూసుకుని వెల్లకిలా పడుకుని వుంది అవురూప. వెన్నెలతో నేసి, మల్లెలు అద్దినట్టున్న మీగడ తరకల్లాంటి మెత్తటి చీర పిక్కలపైదాకా జరిగిపోయివుంది. ఆ మనుపైన వగ్నత్వం మీద నిలవలేక జారిపోతోంది ట్యూబ్‌లైట్ కాంతి! పమిట కావాలని తొలగించినట్టుగా ఆ పక్క జరిపేసి వుంది. చక్కెర పాకాన్ని నిండుగా పీల్చుకున్న గులాబ్ జామూన్‌లలా, కోరికతో పెద్దవయి జాకెట్‌ని కాదని సవాల్ చేస్తున్నట్టున్న యవ్వన శిఖరాలు! జాకెట్‌కీ, చీరకీ మధ్య బంగారు పళ్ళెం మధ్యలో గులాబీ మొగ్గలా మెరుస్తున్న నాభి– నడుం పక్క ఎవరికైనా ముద్దులతో అభిషేకించాలనిపించే ముచ్చటైన ముడత.

ఆమె అందం మీదనుంచి బలవంతంగా చూపులు మరల్చుకుని, ముఖం మీద నీళ్ళు చల్లాడు శాండిల్య.

చప్పున కళ్ళు తెరిచి ఆ చేతిని పట్టుకుంది అవురూప. అనుకోని ఈ పరిణామానికి అతని చేతిలో గ్లాసు జారిపోయింది.

క్షణం ఆలస్యం చేయక బలంగా అతడిని తన మీదికి లాక్కుంది ఆమె. శాండిల్య తూలి ఆమె మీద పడ్డాడు. అతని గడ్డం ఆమె చెక్కిళ్ళకు గిలిగింతలు పెడుతోంది. అతని పెదవుల వేడికి ఆమె నాలుక కందిపోయినట్టుగా ఎర్రగా మెరుస్తూ..! రెండు చేతులతో అతని భుజాలకు సంకెళ్ళు వేసింది ఆమె!బలవంతంగా ఆమెను పక్కకు తోసి నిలబడ్డాడు శాండిల్య.

చేతిలో తాళం స్ట్రాంగ్ రూంలోనే క్రింద పడింది ఆమెను ఎత్తుకు తీసుకువస్తున్నప్పుడు.

నియమాలకు విరుద్ధం అని తెలిసినా విధిలేక తానే రెండు తాళాలూ ఉపయోగించి క్యాష్ బీరువా తలుపు మూసి స్ట్రాంగ్ రూం తలుపు లాక్ చేశాడు.

ఇవతలకి వచ్చేసరికి అవురూప లేదు.

రాత్రి పది గంటలకి శాండిల్య ఏదో మేగజైన్ తిరగేస్తుంటే ఫోన్ మ్రోగింది.

"నేను అవురూపని!" అవతల నుంచి తీయని స్వరం.

"సెకెండ్ కీ వదిలేసి వెళ్ళిపోయారు– బ్యాంక్ రూల్స్‌కి అది వ్యతిరేకం అని తెలియదా?" కోపంగా అడిగాడు శాండిల్య.

"ప్రొబేషనర్‌ని కదా! రేపు మేనేజర్ గారి కంట పడకుండా మీ దగ్గర నుంచి తీసుకుని ఆయనకిచ్చేస్తాను. ఇంతకీ ఏం చేస్తున్నారు?" అసలా సాయంత్రం ఏమీ జరగనట్టు మామూలుగా మాట్లాడేస్తోంది అవురూప.

"ఏం లేదు! పొడిగా అన్నాడు శాండిల్య.

"మీ శ్రీమతి ఏం చేస్తోంది?"

"పడుకుంది!"

'మా పిన్ని కూతురు మొగుడితో కలసి సెకెండ్ షోకెళ్ళింది! ఓస్సారి రాకూడదూ! గంటలో వెళ్ళిపోవచ్చు!"

క్షణం నోరు పెగల్లేదు శాండిల్యకి.

అవతల నుంచి అవురూపే మళ్ళీ మాట్లాడింది– "ఎందుకో తెలియదు– మీరంటే చెప్పలేనంత ఆకర్షణ ఏర్పడిపోయింది నాకు! ఒక్కసారయినా మీతో కలసి ఆనందించాలి!

'షటప్!" అరచినంత పని చేశాడు శాండిల్య.

"మీకేమయినా పిచ్చిపట్టిందా? నాకు పెళ్ళయింది. భార్య, పిల్లలు వున్నారు. మీరు పెళ్ళి కావలసిన వారు. అంతటి అర్థవంతమైన పేరు పెట్టుకుని స్త్రీ అవురూప వరంగా భావించే దాన్ని క్షణికావేశంలో పోగొట్టుకుంటారా? మనసు ప్రశాంతం చేసుకోండి!" మరేమీ మాట్లాడేది లేనట్టుగా రిసీవర్ పెట్టేశాడు శాండిల్య.

** ** ** ** **

అందరి ముందూ బ్యాంక్‌లో శాండిల్యతో మామూలుగా మాట్లాడుతోంది అవురూప. ఎవరూ లేనప్పుడు, "ఆడదాన్ని నేనే ఏ సంకోచం లేకుండా ఆహ్వానిస్తుంటే మగ మహారాజులు– మీకేమిటి అభ్యంతరం?" అంటూ మాటిగా అడిగేసేది ఆమె.

"శీలం అన్నది ఆడ, మగ ఎవరికైనా అవసరం!"

'ఒక్కసారి నా కోరిక తీరిస్తే మీకు పోయేదేమిటి?"

"నాకిష్టం లేదు. అంతే. నా మీనాక్షికి నేను అన్యాయం చేయలేను".

అవురూప ఆలోచనలో పడింది శాండిల్యకి భార్య అంటే అమితమైన ప్రేమ. అసలు ఆమె అలా వుంటుంది? తనకంటే అందంగా వుంటుందా? ఒకసారి ఆమెను చూడాలి!

ఆరోజు సాయంత్రం తలనొప్పిగా వుందని నాలుగింటికే బ్యాంక్‌లోంచి బయటపడింది.

రఘువీర్ టాకీసు వెనుక కమలా నగర్‌లో శాండిల్య ఇల్లు కనుక్కోవడం కష్టం కాలేదు.

కాలింగ్ బెల్ రెండు సార్లు మోగించాక ఒక పధ్నాలుగేళ్ళ పిల్ల వచ్చి తలుపు తీసింది. చూడబోతే పనిపిల్లలా వుంది. వచ్చింది అయ్యగారి బ్యాంక్‌లో పని చేసే ఆవిడే అని తెలుసుకున్నాక లోపలికి తీసుకెళ్ళింది.

బెడ్‌రూంలో ముప్పయ్ ఐదేళ్ళ స్త్రీ మంచం మీద పడుకుని ఏదో వారపత్రిక తిరగేస్తోంది. చూడగానే ఆమె నడుం క్రింది భాగంలో చలనం లేనట్టుగా తెలిసిపోతోంది.

"కూర్చోండి!" కళ్ళతోనే మంచం దగ్గరగా వేసివున్న కుర్చీ చూపించింది ఆమె.

"బ్యాంక్ నుంచి వచ్చిన దగ్గరనుంచీ నాకు నిద్ర పట్టేదాకా ఆ కుర్చీలోనే కూర్చుంటారాయన!"మీరు అవురూప కదూ!"

"మీకెలా తెలుసు?" ఆశ్చర్యపోయింది అవురూప.

"ఆయన బ్యాంక్‌లో మీరు తప్ప ఆడవాళ్ళింకా ఎవరున్నారు గనక! ఇక ఇరవై రోజుల్లో వెళ్ళిపోతారట గదా?"

తను ఎప్పుడు వెళ్ళిపోతానా అని రోజులు లెక్కిస్తున్నాడల్లే వుంది శాండిల్య!

ఇంతలో పనిపిల్ల రెండు కప్పుల్లో కాఫీ తెచ్చింది. మంచం వెనుక రెండు దిళ్ళు నిలువుగా పెట్టి ఆమెను పైకి జరిపి, ఆమె చేత ఓపికగా కాఫీ త్రాగించిందా పిల్ల.

"ఆయనొచ్చాక ఈ డ్యూటీ ఆయన నెత్తిన పడుతుంది. ఆడవాళ్ళం! మనకయినా వుండదు అంత ఓపిక. భర్త మంచితనం గురించి, తన మీదున్న ప్రేమ గురించి రెండో పిల్ల పుట్టాక పురిట్లో తనకొచ్చిన పక్షవాతం గురించి, మళ్ళీ పెళ్ళి చేసుకోమంటే భర్త పెట్టే చీవాట్ల గురించి అనర్గళంగా మాట్లాడేస్తోంది మీనాక్షి.

అన్యమనస్కంగా ఆమె మాటలకు ఊ కొడుతూ చీకటి పడడడంతో లేచింది అవురూప.

మర్నాడు సాయంత్రం శాండిల్య ఒక్కడే టాలీ కాని ఎస్.బి. లెడ్జర్ చూస్తుంటే వెళ్ళి అతని ఎదురుగా కూర్చుంది. ఆ

"నిన్న మీ ఇంటికి వెళ్ళాను".

"మీనాక్షి చెప్పింది!"

"ఆమె నుంచి అప్పుడే ఐదేళ్ళుగా మీకు సుఖం లేదు".

చురుగ్గా ఆమె కళ్ళల్లోకి చూశాడు శాండిల్య.

మిమ్మల్ని మరో పెళ్ళి చేసుకోమని తనంతట తనే మీకు చెబుతోంది!"

"అయితే?"

"మిమ్మల్ని పెళ్ళి చెసుకోమని నేను అడగడం లేదు. మీరు సుఖపడటంలో తప్పు లేదని అంటున్నాను. మేరేమీ భార్యకు సంజాయిషీ చెప్పకోనవసరం లేదుగా?

"మీనాక్షికి సంజాయిషీ చెప్పకోకపోయినా నా మనసాక్షికి చెప్పకోవాలిగా?

ఆమాట సూటిగా బాణంలా అవురూప గుండెల్లో గుచ్చుకుంది.

మనసున్న ఆమె ఇరవై రోజుల తరువాత ఆ వూరు వదిలి వెళ్ళేటప్పుడు తల దించుకునే శాండిల్యకి రెండు చేతులూ జోడించింది.